

రేపు ముథోల్‌లో ఇన్‌చార్జ్ మంత్రి పర్యటన

భైంసా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకుగాను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నట్లు మాజీఎమ్మెల్యేలు భోస్లే నారాయణ్ రావ్‌పాటిల్, జీ.విఠల్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారన్నారు. మొదట భైంసా పట్టణంలోని పార్డి (బి) బైపాస్ మార్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ఆ తర్వాత కుభీర్ మండలంలోని పార్డి (బీ) నుంచి హల్దా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, తదితర రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

గోదారి గట్టున వృక్షమాల



- నదీతీరం పరివాహకం వెంట చెట్ల పెంపకం
- భూమి కోతకు అడ్డుకట్ట
- ఆజాదికా అమృతోత్సవంలో భాగంగా ఏర్పాట్లు
- ప్రయోగాత్మకంగా మూడుమండలాలు ఎంపిక

వరదలకు తీర ప్రాంతం దెబ్బతినకుండా ఆజాదీకా అమృత్యోత్సవ కార్యక్రమంలో భాగంగా వృక్షమాల పథకాన్ని అమలు చేయనున్నారు. ఇందుకు పైలెట్ ప్రాజెక్టుగా కడెం, సోన్, నర్సాపూర్ జి మండలాలను ఇప్పటికే ఎంపిక చేశారు. ఈ పథకం అమలుతో బహుళ ప్రయోజనాలు సాధించవచ్చని భావిస్తున్నారు.

నిర్మల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రవహించే గోదావరి నది తీర ప్రాంతం వరదల నుంచి దెబ్బ తినకుండా కాపాడేందుకు పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించారు. ఉపాధిహామీ పథకం ద్వారా వృక్షమాల పేరిట గోదావరి పరివాహక ప్రాంతంలోని మట్టిని కాపాడేందుకు కార్యచరణ చేపట్టబోతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆజాదీకా అమృత్యోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ వృక్షమాల పథకాన్ని అమలు చేయనున్నారు. దీనికి సంబంధించి ఉపాధిహామీ అధికారులు ఇటీవలే జిల్లాలోని బాసర నుంచి ఖానాపూర్ వరకు గల గోదావరి పరివాహక ప్రాంతంలో సర్వే పూర్తి చేశారు. గత కొన్నేళ్ల నుంచి గోదావరి ప్రవాహం విపరీతంగా పెరుగుతున్న కారణంగా గోదావరి తీరం వెంబడి ఉన్న భూ మంతా పెద్దఎత్తున కోతకు గురవుతోందని, ఈ సర్వే ద్వారా గుర్తించారు. అలాగే గోదావరి ప్రవాహం మధ్యలో ఉన్న కొర్రులలో పిచ్చి మొక్కలు కూడా భూమి కోతకు కారణమవుతున్నాయ ని నిర్ధారించారు. బాసర నుంచి మొదలుకొని జిల్లాలోని 11 మండలాల పరిధిలో గోదావరి నది ప్రవహిస్తోంది. ఈ పదకొండు మండలాల తీర ప్రాంతాల్లో నీటి ప్రవాహం కారణం గా భూగర్భజలాలు విపరీతంగా పెరుగుతా యి. అలాగే సాగుకు కూడా ఈ నీరు ఉపయోగపడుతోంది. మొదట గోదావరి నదిలోని కొర్రులను వృక్షమా ల కోసం ఎం పిక చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా మూడుచోట్ల గల కొర్రులలో మొక్కలను నాటనున్నారు. కొర్రు ప్రాంతంలో 70 ఎకరాల విస్తీర్ణం వృక్షమాల కింద మొక్కలు నాటేందుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడ దాదాపు 70 ఎకరాల్లో కాగితం తయారీకి ఉపయోగపడే నీలగిరి మొక్కలను నాటాలని నిర్ణయించారు. అధికారులు ఈ 70 ఎకరాల్లో అవసరమయ్యే మొక్కలు, వ్యయ అంచనాలకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. ఇందు లో భాగంగానే సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మి ల్లు అ ధి కా రు లతో కూడా అవగాహన చర్యలు మొదలుపెట్టారు.

ఆజాదీకా అమృత్యోత్సవ్ పథకం కింద...

పర్యావరణ పరిరక్షణ, నది పరివాహక ప్రాంతాల్లో కోత నివారణతో పాటు భూముల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్యోత్సవ్‌లో భాగంగా అమలు చేస్తున్న వృక్షమాల కింద ఇక్కడి గోదావరి నది తీర ప్రాంతాన్ని ఎంపిక చేశారు. జిల్లాలోని మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈ వృక్షమాలను అమలు చేయతలపెట్టారు. కడెం, సోన్, నర్సాపూర్ జి మండలాలను ఇప్పటికే ఎంపిక చేశారు. కడెం మండలంలో 10, సోన్ మండలంలో 70, నర్సాపూర్‌జి మండలంలో మూడు ఎకరాల్లో వృక్షమాల కింద మొక్కలను నాటనున్నారు. నది పరివాహక ప్రాంతంలో అనుకూలంగా ఉండే తెల్లేరు, మద్ది, వేప, అల్ల నేరేడు, తుమ్మ, తిప్ప నీలగిరి, చింత తదితర మొక్కలను నాటాలని నిర్ణయించారు. అయితే ఉపాధిహామీ కూలీలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. రెండున్నర ఎకరాలకు ఒక బ్లాక్ ఏర్పాటు చేసి అందులో ప్లాంటేషన్ పనులను చేయనున్నారు. ఈ పథకంపై ఉపాధిహామీ అధికారులు గోదావరి నది తీర ప్రాంతాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైతే వారందరి భాగస్వామ్యాన్ని కూడా తీసుకోవాలని యోచిస్తున్నారు.


గోదావరి తీరం వెంట చెట్ల పెంపకంతో బహుళ ప్రయోజనాలు సాధించవచ్చని అంటున్నారు. ఓ వైపు మట్టి కొట్టుకుపోకుండా కాపాడడమే కాకుండా తీరం వెంట చెట్ల పెంపకంతో వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని భావిస్తున్నారు. తీరం వెంట స్వచ్ఛమైన గాలి అందుబాటులోకి వచ్చే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. దీంతో పాటు పరివాహక గ్రామాల ప్రజలకు ఈజీఎస్ కింద మొక్కల

బహుళ ప్రయోజనాల కోసం...

పెంపకంతో ఉపాధి కల్పించనున్నారు. అలాగే పండ్ల మొక్కలను కూడా తీరం వెంట పెంచి ఆ మొక్కల ద్వారా వచ్చే ఫలాలను సంబంధిత గ్రామంలోని ఈజీఎస్ లబ్ధిదారులకే అప్పగించాలని భావిస్తున్నారు. ఇలా బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే వృక్షమాల కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించారు. ప్రయోగాత్మకంగా జిల్లాలోని గోదావరి తీరంలో చేపట్టే ఈ కార్యక్రమం సత్ఫలితాన్నిస్తే రాష్ట్రంలోని అన్ని నదుల తీరాల్లో కూడా ఇలాంటి చెట్ల పెంపకాన్ని చేపట్టాలని భావిస్తున్నారు.

వామ్మో చిరుత

- ముధ్గల్ గ్రామ శివారులో చిరుత సంచారం
- భయాందోళనలో రైతులు



పంట పొలాల్లో చిరుత

ముథోల్,నవంబరు22(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముధ్గల్ గ్రామ శివారులో ఉన్న ఇసుక కాలువ ప్రాంతంలో వారం రోజులుగా చిరుత పులి సంచరిస్తుండడంతో స్థానిక రైతులు, గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు కూడా రైతులు భయపడుతున్నారు. రాత్రివేళలో కాకుండా పగటి సమయంలో కూడా చిరుత పులి కనిపించడం గ్రామస్థుల్లో ఆందోళనను మరింత పెంచింది. పశువులపై దాడులు చేసే అవకాశముందని వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో చిరుతపులి బారినుంచి ప్రజలను, పశువులను రక్షించేందుకు అటవీ శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకుని, గ్రామ పరిసరాల్లో పహారా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. తమ భయాలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న

నిర్మల్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్‌కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి అయినట్లు జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న తెలిపారు. జిల్లాలోని 84 ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల నుంచి 1043 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష కోసం ఖానాపూర్‌లో బాలికల పాఠశాల, నిర్మల్‌లో జుమ్మెరాత్ పేట్ పాఠశాల, కస్బా పాఠశాల, భైంసాలో ఆశ్రమ బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఉంటుందని వెల్లడించారు. పరీక్ష రాసే అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఒక నిమిషం కూడా ఆలస్యమైతే అనుమతించే ప్రసక్తి లేదని వెల్లడించారు. ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్, సెంటర్ లెవల్ అబ్జర్వర్‌లతో పాటు చీఫ్ సూపరింటెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లన్నీ మూసి ఉంచాలని వెల్లడించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల్లో మెడికల్ సిబ్బంది ఉంటారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుబందోబస్తు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

‘వందేమాతరం’ దేశభక్తిని నింపింది

- బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



వందేమాతర గేయాన్ని ఆలపిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది మంది భారతీయుల్లో ‘వందేమాతరం’ గేయం దేశభక్తిని నింపిందని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. భారత జాతీయ గేయం వందే మాతరం 150 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో గల తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సామూహిక వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులతో కలిసి వందేమాతరం గేయం సామూహిక గేయాలాపన వేడుకలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఖేలో ఇండియా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, పాఠశాల ప్రిన్సిపాల్ డేనియల్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, సత్యం చంద్రకాంత్, విలాస్, కార్తీక్, సాయి పాల్గొన్నారు.

ఖానాపూర్ : భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కోట్లాది మంది భారతీయుల్లో ‘వందేమాతరం’ గేయం దేశభక్తిని నింపిందని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. వందేమాతర గేయం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఖానాపూర్‌లో నిర్వహించిన సామూహిక వందేమాతర గేయాలాపన కార్యక్రమానికి స్థానిక ఎంఈవో సంధ్యారాణితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు నల్ల రవీందర్ రెడ్డి, మదిరే శ్రీను, మండలధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, పట్టణాధ్యక్షుడు కీర్తి మనోజ్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు కిషన్‌రెడ్డి, పడిగెల అశోక్, అనిల్ రావు, కొండవేణి రమేష్, జెట్టి సురేందర్, దాసరి శ్రీను, రాపెల్లి రవీందర్, ఎనగందుల నారాయణ, బొప్పారపు సత్యవతి, తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా బొజ్జు పటేల్

- ఖానాపూర్ ఎమ్మెల్యేకు జిల్లా అధ్యక్ష పగ్గాలు అప్పగించిన అధిష్టానం



ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందోనని నిన్నమొన్నటి వరకు ఉన్న ఊహాగానాలకు తెరపడింది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను నిర్మల్ డీసీసీ అధ్యక్షుడిగా ప్రకటిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సారధ్య బాధ్యతలను అప్పగించింది. దీంతో ఇటు ఖానాపూర్‌తో పాటు నిర్మల్, ముథోల్ నియో జకవర్గాల్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వేళ కలిసి వస్తుం దనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నిక సమయంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీలో విజయ దుందుభి మ్రోగించిన ఏకైక ఎమ్మెల్యేగా నిలిచిన బొజ్జు పటేల్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం పార్టీ శ్రేణులకు విజయ తీరాలకు చేర్చేందుకు శ్రమిస్తాడని చెబుతున్నారు. కాగా జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు నిరాశే ఎదురైం దని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులుగా పేరున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పార్టీని నిర్మల్ జిల్లా లో మరింత గాడిలో పెట్టేందుకు ప్రస్తుతం మరో కీలక బాధ్యతను చేపట్టనున్నారు. మూడు నియోజకవర్గాల్లో ఉన్న పార్టీ సీనియర్ నాయకులందరినీ కలుపుకొని ముందుకు వెళ్లేలా సన్నద్ధమవుతున్నారు.

పార్టీ అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తా

నిర్మల్ డీసీసీ అధ్యక్షులుగా నన్ను నియమిస్తూ పార్టీ నాకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తా. నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తా. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా అందరినీ కలుపుకొని ముందుకెళ్తా. జిల్లాలోని సీనియర్ నాయకులందరి సహకారంతో ఖానాపూర్, నిర్మల్, ముథోల్ మూడు నియోజక వర్గాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను గెలుచుకుంటాం. అలాగే నిర్మల్ జిల్లా పరిషత్ పీఠాన్ని సైతం మేము దక్కించుకుంటాం.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు
ఫర్జానుద్దీన్



ఎంపికైన విద్యార్థి ఫర్జానుద్దీన్

కడెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదోతరగతి విద్యార్థి సయ్యద్ ఫర్జానుద్దీన్ అండర్-17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జోనల్‌స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జట్టుకు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. త్వరలో మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని వారు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు, విద్యార్థులు అభినందించారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

ఖానాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద లేబర్ కోడ్ ఆర్డర్ కాపీలను ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ... ఐదు సంవత్సరాల నుంచి పాత లేబర్ చట్టాలను నాలుగులేబర్ కోడ్‌లుగా మార్చి కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న పరిశ్రమల్లో అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఫెడరేషన్లు కార్మిక ఉద్యోగ సంఘాలు అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహించాయన్నారు.

మొదలైన వరి పంట కోత

సోన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ పంట కోత ప్రయోగాలు మొదలయ్యాయి. సాగుచేసిన పంటల్లో దిగుబడులు అంచనా వేయడానికి శనివారం మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలో వరి కోత ప్రయోగాలు నిర్వహించినట్లు గణాంక అధికారి గంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ధాన్యాన్ని తూకం వేసి ఆన్‌లైన్‌లో రిపోర్టు నమోదు చేసినట్లు తెలిపారు. పంట కోతకు ఎంపికైన క్షేత్రాల రైతులు అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉపగణాంక అధికారి ప్రశాంత్, మండల గణాంక అధికారి నిషిత, ఏఈవో అశోక్, రైతులు గోపిగౌడ్, చిన్నయ్య, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

కోతుల బెడద తీర్చండి

- అటవీశాఖాధికారులకు భైంసా పట్టణ బీజేపీ విజ్ఞప్తి



అటవీశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ ప్రతినిధుల బృందం

భైంసా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో రోజురోజుకు అధికమవుతున్న కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని భైంసా పట్టణ బీజేపీ ప్రతినిధుల బృందం అటవీశాఖాధికారులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంబంధిత విషయంలో శనివారం బీజేపీ ప్రతినిధులు బండారి దిలీప్, కాసరోళ్ల ప్రవీణ్‌ల నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఇక్కడి అటవీశాఖాధికారి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రతినిధులు మాట్లాడుతూ కోతుల బెడదతో పట్టణవాసులు బెంబేలెత్తిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధులు, పిల్లలు ఇంటి నుంచి బయటకు రావాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయని వారు పేర్కొన్నారు. పట్టణ పరిధిలో నిత్యం ఏదో ఒక చోట కోతులు దాడులకు పాల్పడటం, ప్రజలు గాయపడి ఆసుపత్రుల పాలవడం సర్వసాధారణ విషయంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖాధికారులు తక్షణమే స్పందించి కొతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఇందులో బీజేపీ ప్రతినిధులు వెంకటేష్, గోవర్ధన్, రాజు, లక్ష్మణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

కుభీర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లోని కేజీబీవీ పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి భోజన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతిగదులు, కంప్యూటర్ ల్యాబ్స్, మధ్యాహ్నభోజనం తదితర వాటిని పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీలో మొదటి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్‌సైన్స్ విద్యార్థులతో సైన్స్ అండ్ టెక్నాలజీ, భవిష్యత్తు ఏఐ ప్రాముఖ్యతను వివరిస్తూ టెక్నాలజీ రంగంలో రంగంలో రాణించాలంటే మరింత మక్కువతో చదవాలని విద్యార్థులకు సూచించారు. కేజీబీవీలో ఇంటర్‌తరగతుల భవన నిర్మాణం కోసం ఏఈ మహేష్ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ఈయన వెంట జిల్లా సెక్టోరియల్ అధికారి నుగురి ప్రవీణ్ కుమార్, ఎంఈవో రాజుల్దేవి, విజయ్‌కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి. సురష్, గంగాధర్, ఏఈ మహేష్, ఆర్‌పి దత్తాత్రి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సీఆర్‌పీ బాలేరావు గంగాధర్, గంగాధర్, ఆనంద్ విద్యార్థులు తదితరులున్నారు.

ట్రిపుల్ ఐటీని సందర్శించిన
ఆర్మూర్ పాఠశాల విద్యార్థులు



ట్రిపుల్ ఐటీని సందర్శించి విద్యార్థులు

బాసర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్‌ఐటీని శనివారం ఆర్మూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ మాట్లాడుతూ ఇలాంటి సందర్శనాలు విద్యార్థుల్లో సైద్ధాంతిక తరగతి గది అభ్యాసానికి, ఆచరణాత్మక వాస్తవాలకు మధ్య అంతరాన్ని తగ్గించడానికి తోడ్పడతాయని, ఇలాంటి సందర్శనలు విద్యార్థులలో పరిశీలన దృష్టిని, సంబాషణ నైపుణ్యాన్ని, అధ్యాయన శీలతను పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ అంతా తిరిగి, తమ సందేహాలను ట్రిపుల్‌ఐటీ, ఐటీ అధ్యాపకులతో, ల్యాబ్ స్టాఫ్ చేత నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో డా. ఎస్ విఠల్, డా. కే.మహేష్, ఎష్.శేఖర్, డా.దేవరాజ్, డా. ప్రకాష్, వివిధ విభాగాధితపులు, ల్యాబ్ స్టాఫ్ పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

పోలీసుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటాం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పోలీసు సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హామీ ఇచ్చారు. శనివారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సదరు కుటుంబ సభ్యులను ఆహ్వానించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా కార్పస్ ఫండ్‌లో వచ్చిన రూ. లక్ష చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ఎలాంటి సందర్భంలోనైనా పోలీసు యంత్రాంగం సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్ సులోచన పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన నేతలు


కలెక్టర్‌ను సత్కరిస్తున్న నేతలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక అవార్డు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షాను కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం.. వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.7 లక్షలు వసూలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన దరావత్ రమేష్ స్థానిక గంగాధర్ అనే వ్యక్తితో సచివాలయంలో పని చేస్తానని పరిచయం చేసుకున్నాడు. గంగాధర్ కూతురికి ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రూ.7 లక్షలు వసూలు చేశాడు. నకిలీ ప్రొసీడింగ్ కాపీ, గుర్తింపు కార్డు సైతం ఇచ్చాడు. చివరికి మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా... నిందితుడిని అరెస్ట్ చేశారు.

మాయ మాటలు చెప్పి మోసం చేసిన..

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భర్త చనిపోయిన ఓ మహిళను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన కంది రమాకాంత్ గత రెండేళ్ల కిందట పరిచయమైన ఓ మహిళతో శారీరక సంబంధం ఏర్పరుచుకుని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. చివరికి పెళ్లి చేసుకోనని ఖరాఖండిగా చెప్పేయడంతో సదరు మహిళ హార్పిక్ తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరపగా పెళ్లి పేరుతో మోసంచేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల పర్యటన

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు జిల్లాలో పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పర్యటనకు వచ్చిన 14 మంది శిక్షణ అధికారులకు స్వాగతం పలికి వారిని పరిచయం చేశారు. బేల మండలంలోని అవల్‌పూర్ గ్రామం, తలమడుగు మండలంలోని దేవాపూర్, సోనాల మండల కేంద్రంలో మూడు బృందాలుగా విభజించి పర్యటన నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదనంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఒక వార్డులో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, పారిశుధ్యం, వ్యవసాయం, జీవనోపాధి తదితర అంశాలపై శిక్షణ అధికారులు అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. క్షేత్ర పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, పర్యటన ముగింపులో తాము చేసిన అధ్యయన ఫలితాలపై సూచనలు ఇవ్వాలని శిక్షణ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీవో రవీందర్, డీఏవో శ్రీధర్, డీఎంహెచ్‌వో నరేందర్, పరిశ్రమల శాఖ జీఎం పద్మ భూషణ్ రాజ్, రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ ప్రభాకర్ స్వామి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

విద్యార్థులకు బ్లాక్ బోర్డు అందజేత


బ్లాక్ బోర్డును విరాళంగా అందిస్తున్న యూత్ సభ్యులు

బోథ్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోనాలకు చెందిన ఓపె వెల్ఫేర్ సొసైటీ తరఫున బ్లాక్ బోర్డును అందివ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు ముబీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మరిన్ని వసతుల కల్పనకు తమవంతు సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్‌జనరల్ సెక్రటరి మతిన్, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ ఇర్ఫాన్‌కోశాధికారి యూత్ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వందేమాతరం దేశ సమైక్యతకు మూలం


బోథ్‌లో వందేమాతర గీతం ఆలపిస్తున్న విద్యార్థినులు

బోథ్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గీతం భారతదేశం ఐక్యతకు మూలంగా ఉందని దీనిని దేశంలోని అన్ని పాఠశాలల్లో పాడాలని అంతేకాక బీజేపీ ప్రతీ కార్యకర్త వందేమాతరం గీతం స్వాతంత్ర సమరయోధులకు ఏ విధంగా ఉపయోగపడింది అనేది ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సరస్వతిశిశుమందిర్ విద్యార్థులతో కలిసి బస్టాండ్‌లో గీతం ఆలపించారు. ప్రతీ పౌరుడు వందేమాతరం గీతాన్ని ఆలపించాలని ఈ గీతం అందరికి కంఠస్తం కావాలన్నారు. వందేమాతరం గేయం ఒక 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గేయం ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల అధ్యక్షులు బోరిరవీందర్‌తో పాటు హిందువాహిణి సభ్యులు భజరంగ్‌దళ్ సభ్యులు పాల్గొన్నారు.

సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం


యూనియన్ నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్) ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్‌గా మాదస్తు రాజేశ్వర్, కో కన్వీనర్‌గా ఎన్నికైన నూకల దేవేందర్ ఎన్నికైన నేపథ్యంలో వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా తనవంతు చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. అదేవిధంగా సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

లక్కీ డ్రా ద్వారా వార్డు సభ్యుల రిజర్వేషన్లు


సోనాలలో రిజర్వేషన్లను ఎంపిక చేస్తున్న ఎంపీడీవో

బోథ్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వ ఆదేశాల అనుసారం శనివారం వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవో మహేందర్ ఆధ్వర్యంలో రాజకీయ పక్షాల నాయకులతో కలిసి లక్కీ డ్రా ద్వారా రిజర్వేషన్ వివరాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ సీఈవోపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి విక్రయించేందుకు వచ్చిన తనపై మార్కెట్ సీఈవో పండరి దుర్భాషలాడుతూ తోసేసాడని లేకరవాడ గ్రామానికి చెందిన రైతు సంద మహేష్ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మద్యం మత్తులో సదరు అధికారి ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

పరిస్థితులు అనుకూలించక పోతే సోమవారం ఉదయం నోటిఫికేషన్ జారీకి అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 24న స్థానిక ఎన్నికలపై హైకోర్టుకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఆలోగానే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఎన్నికలను మూడు విడతల్లో డిసెంబర్ 2వ వారంలో నిర్వహించే విధంగా ప్లాన్ చేస్తున్నారు.

అధికారిక ప్రకటనపై ఆసక్తి...

రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను ప్రారంభించడంతో ఆశావాహ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల అధికారిక ప్రకటన కోసం అంతటా ఆసక్తి కనిపిస్తుంది. ఈ సారి అనుకూలమైన రిజర్వేషన్ వస్తుందో రాదోనన్న ఆందోళన కనిపిస్తుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు యథావిధిగానే ఉంటాయని తేలిపోవడంతో ఆ వర్గాల్లో అంతగా ఆందోళన కనిపించడం లేదు. ప్రధానంగా బీసీ సామాజిక వర్గం నేతల్లోనే కొంత ఆందోళన వ్యక్తమవుతుంది.ఇప్పటికే బీసీరిజర్వేషన్లు ఖరారైన స్థానాల్లో మళ్లీ మార్పులు ఉండే అవకాశం ఉందంటున్నారు.దీంతో చాలా గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్ రిజర్వేషన్లు తారుమారయ్యే అవకాశం కనిపిస్తుంది. గతంలో రిజర్వేషన్లు అనుకూలంగా రావడంతో కొంత మంది నేతలు ఓటర్ల మద్ధతును కూడగట్టేందుకు పలురకాల ప్రయత్నాలు చేశారు.

రిజర్వేషన్ల విధి విధానాలు ఖరారయ్యాయి..

● రమేష్ (జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్)



పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సర్పంచ్, వార్డుమెంబర్ రిజర్వేషన్ల ఖరారు కోసం విధి విధానాలను ఖరారు చేసింది. ఇప్పటికే జీవో నంబర్ 46ను ప్రభుత్వం జారీ చేసింది. దీనాధారంగానే రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తు చేస్తున్నాం. ఆదివారం సాయంత్రంలోగా రిజర్వేషన్లను పూర్తి చేసి నివేదికను అందిస్తాం. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ ఆమోదంతో రిజర్వేషన్ల ను ఫైనల్ చేసి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంటుంది.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవినాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉట్నూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, మండల పరిషత్ యాజమాన్యాల ద్వారా పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా పూర్తి కృషి చేస్తానని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రవీందర్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని సాలెవాడకె జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రవినాయక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎళ్లవేళలా టీచర్లకు అందు బాటులో ఉంటానని మీ సమస్యలకు పరిష్కారానికి జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యలను తీరుస్తానని ఉపాధ్యాయుల సంక్షేమమే తన సంక్షేమమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ రాజ్‌కుమార్, దినేష్‌కుమార్, ప్రకాష్, రవీందర్, మహిళ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో చరణ్ తేజ్ ప్రతిభ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన కొమ్ము చరణ్ తేజ్ క్రీడల్లో సత్తా చాటుతున్నాడు. ఇటీవల స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఆయన.. తాజాగా టేబుల్ టెన్నిస్‌లో స్వర్ణ పతకం సాధిచాడు. నిర్మల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జోనల్ స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ప్రశంసలు పొందారు.

సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు

నర్సాపూర్(జి), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొత్తం 12 గ్రామ పంచాయతీలలో 2025 సంవత్సరానికి కేటాయించిన రిజర్వేషన్‌లలో మహిళలకు అధిక ప్రాధాన్యం లభించింది. యూఆర్ (అన్ రిజర్వ్) కేటగిరీలోని మొత్తం 6 స్థానాలలో 3 స్థానాలు (గొల్లమాడ, నర్సాపూర్(జి), రాంపూర్) మహిళలకు ప్రత్యక్షంగా (యూఆర్ (డబ్ల్యూ) రిజర్వ్ చేయగా, మిగిలిన 3 స్థానాలలో (బూరుగుపల్లి(జి), కుస్లీ, టెంబుర్ణి) పురుషులు, మహిళలకు సమాన అవకాశం (యూఆర్ (ఎం/డబ్ల్యూ) కల్పించారు. బీసీ (బ్యాక్‌వర్డ్ క్లాస్) కేటగిరీలోని 3 స్థానాలలో 1 స్థానం (తురాటి) మహిళలకు (బీసీ (డబ్ల్యూ) రిజర్వ్ చేశారు. 2 స్థానాల్లో (తిమ్మాపూర్, అర్లీ(కే) పురుషులు/ మహిళలకు అవకాశం ఉంది. ఎస్సీ (షెడ్యూల్డ్ కాస్ట్) కేటగిరీలోని 2 స్థానాలలో 1 స్థానం (నందన్) మహిళలకు (ఎస్సీ (డబ్ల్యూ)), మరో 1 స్థానం (చాక్‌పల్లి) పురుషులు/మహిళలకు కేటాయించారు. ఏకైక ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్) స్థానం (భామ్ని(బి) కూడా మహిళలకు ప్రత్యక్షంగా రిజర్వ్ చేశారు. (ఎస్టీ(డబ్ల్యూ)).

పెంబి : పెంబి మండలంలోని 24 గ్రామ పంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్‌లు ఆంకెన ఎస్టీ జనరల్, దొందారి ఎస్టీ మహిళ, హరిచందర్ తండా ఎస్టీ జనరల్, జంగుగూడ ఎస్టీ మహిళ, కర్ణం లొద్ది ఎస్టీ జనరల్, క్రిష్ణనాయక్ తండా ఎస్టీ జనరల్, కోరికంటి తండా ఎస్టీ మహిళ, కోసగుట్ట ఎస్టీ మహిళ, పెంబి తండా ఎస్టీ జనరల్, లోతర్య ఎస్టీ జనరల్, పోంచపల్లి ఎస్టీ మహిళ, రాంనగర్ ఎస్టీ జనరల్, తాటిగూడ ఎస్టీ మహిళ, యాపల్‌గూడ ఎస్టీ జనరల్, పీపీ వెంకంపోచంపాడ్ ఎస్టీ మహిళ, గుమ్మెన ఎంగ్లాపూర్ ఎస్టీ మహిళ, పస్పుల ఎస్టీ జనరల్, పెంబి ఎస్సీ జనరల్, శెట్‌పల్లి బీసీ జనరల్, పుల్గంపాండ్రి జనరల్, ఇటిక్యాల్ జనరల్ మహిళ, వేణు నగర్ జనరల్, మందపల్లి జనరల్ మహిళ, నాగపూర్ జనరల్.

దిలావర్‌పూర్ : గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం సర్పంచ్ రిజర్వేషన్‌లను ఖరారు చేశారు. దిలావర్‌పూర్ మండలంలోని 12 గ్రామపంచాయతీలకు గాను ఎస్టీ 2, ఎస్సీ 2, బీసీ 2, జనరల్‌కు 6 గ్రామ పంచాయతీలను కేటాయించారు. సాంగ్వి ఎస్టీ (మహిళ), కాల్వ తండా ఎస్టీ (జనరల్), సముందర్‌పల్లి ఎస్సీ (జనరల్), కాల్వ ఎస్సీ (మహిళ), కంజర్ బీసీ (జనరల్), న్యూ లోలం బీసీ (మహిళ), గుండంపల్లి (జనరల్), బన్సపల్లి (జనరల్), సిర్గాపూర్ (జనరల్ మహిళ), దిలావర్‌పూర్ (జనరల్ మహిళ), మాడెగాం (జనరల్), మాయాపూర్ (జనరల్ మహిళ)గా రిజర్వేషన్లను ఖరారు చేశారు.

ముథోల్ : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముథోల్ మండలానికి సంబంధించిన తాజా రిజర్వేషన్ జాబితాను అధికారులు విడుదల చేశారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల జనాభా ప్రకారం మండలంలోని జీపీల రిజర్వేషన్లు ఈ విధంగా ఉన్నాయి. ఎడ్‌బిడ్ తండా ఎస్టీ జనరల్, చింతకుంట ఎస్టీ మహిళ, కారేగాం ఎస్సీ జనరల్, విట్టోలి ఎస్సీ మహిళ, మచ్కల్ ఎస్సీ జనరల్, ఆష్టా బీసీ మహిళ, చించాల బీసీ జనరల్, వెంకటాపూర్ బీసీ మహిళ, వడ్తాల్ బీసీ జనరల్, రువ్వి బీసీ జనరల్, బోరిగాం జనరల్, బ్రహ్మన్‌గాం జనరల్ మహిళ, ఎడ్‌బిడ్ జనరల్, గన్నోర జనరల్, ముద్గల్ జనరల్ మహిళ, ముథోల్ జనరల్ మహిళ, రాంటెక్ జనరల్, తరోడా జనరల్, విట్టోలి తండా జనరల్ మహిళగా రిజర్వేషన్లు ఖరారు. చేశారు. 19 గ్రామ పంచాయతీలకు గాను జనరల్ 9, ఎస్టీ 2, ఎస్సీ 3, బీసీ 5 జీపీలు రిజర్వేషన్ అయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం గాజులపేట ప్రాంతంలో ఎల్‌టీ లైన్ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

మహిళల అభ్యున్నతికి కృషి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


పెంబిలో ఇందిరమ్మ చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కడెం/దస్తురాబాద్/ఖానాపూర్/పెంబి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి రాష్ట్రం లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కడెంలోని రైతుభవన్ వేదికలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో నిర్మల్ డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ రామడుగు శైలజ, రమేష్ రావు, పీఏసీఎస్ డైరెక్టర్ గొల్ల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పి.సతీష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ భవాని, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

దస్తురాబాద్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మహిళా ఉన్నతి... తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మండలంలోని భూత్కూర్ గ్రామస్థులు, మహిళలు తమ ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, ఏపీఎం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షుడు నరేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : ప్రజాపాలనలో తమ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి చేయూతనందిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల సాధికారిత కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నో బృహత్తర పథకాలు అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి, ఇందిరమ్మ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూమన్న, వైస్ చైర్మన్ మాజీద్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, అంకం రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, జిల్లా నాయకులు జన్నారపు శంకర్, జంగిలి శంకర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, నాయకులు, తదితరులున్నారు. ఖానాపూర్ పట్టణంలోని పలు కాలనీల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శనివారం ఉదయం మార్నింగ్ వాకింగ్ చేస్తూ కాలనీల్లోని సమస్యలు తెలుసుకున్నారు.

పెంబి : మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం పెంబి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు ఇందిరా శక్తి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సల్ల స్విప్నిల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భూషణ్, జడ్పీ సీఈవో గోవింద్, పీడీ విజయలక్ష్మి, ఏపీఎం రాజేష్, ఎంపీవో అనిల్, మాజీ ఏఎంసీ చైర్మన్ పుప్పాల శంకర్, మజీద్, తులాల శంకర్, సుతారి రమేష్, కే. నర్సయ్య, మహేందర్, దేవేందర్ రెడ్డి, స్వామి, గంగాధర్, రాజన్న, రమేష్, మోహన్ రెడ్డి, ఖాన్, సీసీలు రమేష్, వాణి, రమణ ఉన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఇందిరమ్మ చీరలు

ముథోల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళాసంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న ఇందిరమ్మ చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఇందిరా మహిళా శక్తి స్కీమ్ కింద మహిళాసంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి చీర ఇవ్వాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చీరలను పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు గాను 25 గ్రామ సంఘాలున్నాయి. అయితే 25 గ్రామ సంఘాలలో 8,992 మంది స్వయం సహాయక సంఘ సభ్యులున్నారు. చీరలు మాత్రం 8,992 చీరలకు గాను 6,283 చీరలు మాత్రమే వచ్చాయి. మిగతా 2,709 చీరలు రావాల్సి ఉన్నాయి. ఇప్పుడైతే సంబంధిత ఐకేపీ సిబ్బంది గ్రామ పంచాయతీల వారీగా 70 శాతం చీరలను వీవో అధ్యక్షుల వద్దకు చీరలను చేరవేస్తున్నారు. త్వరలోనే ఒక్కొక్కరికి ఒక్కొక్క చీరను పంపిణీ చేయ నున్నట్లు ఏపీఎం గురుచరణ్ తెలిపారు. మిగతా 30 శాతం 2,709 చీరలు కూడా త్వరలోనే వస్తాయని వచ్చిన తర్వాత మిగతా సంఘ సభ్యులు కూడా అందజేస్తామని తెలిపారు. చీరలను త్వరలోనే స్వయం సహాయక సంఘ సభ్యులకు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ భావాలు పెంపొందించుకోవాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్


భైంసాలో గేయాలాపన చేస్తున్న దృశ్యం

భైంసా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికబద్దంగా విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ దేశభక్తి, జాతీయతాభావాలను పెంపొందించుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పిలుపునిచ్చారు. శనివారం భైంసాలోని పులేనగర్ సుభద్రవాటిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో జరిగిన సాముహిక వందేమాతర గేయాలాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇందులో పాఠశాల అధ్యక్షులు కొండా గంగాధర్ గౌడ్, కార్యదర్శి మంతెన వెంకటేష్, జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్, సమతి ప్రతినిధి శైలేష్ మహాశెట్టివార్,బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షులు రావుల రాము,కార్యదర్శి దగ్గే శ్రీకాంత్, ప్రతినిధులు ఎనుపోతుల మల్లేశ్వర్, తూమోల్ల దత్త్రాత్రి, వడ్నపు శ్రీనివాస్, గౌతం పింగ్లే, రావుల పోశెట్టి, గాలి రాజు పాల్గొన్నారు.

యూరియా తగిన మోతాదులో వాడాలి

» డీఏవో అంజి ప్రసాద్



రైతు సదస్సులో మాట్లాడుతున్న డీఏవో అంజి ప్రసాద్

ముథోల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా తగిన మోతాదులో వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. మండలంలోని కారేగాం గ్రామంలోని రైతు వేదికలో శనివారం స్పిక్ (ఎస్‌పీఐసీ), గ్రీన్ స్టార్ ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ సదస్సులో పాల్గొని మాట్లాడారు. యూరియాను తగిన మోతాదులో మాత్రమే వాడాలని, అధికంగా వాడితే నేలసారాన్ని దెబ్బ తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. అలాగే రైతులు పంట మార్పిడి తప్పకుండా పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. పంటల సంరక్షణ, ఎరువుల వినియోగం, ఆధునిక సాగు పద్ధతులపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి రచన, హరికృష్ణ, ఏఈవో ప్రవీణ్, స్పిక్ రీజినల్ మేనేజర్ వివ, పీఏసీఎస్ సీఈవో సాయిరెడ్డి, ఎంఏసీటీఎస్ చైర్మన్ నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నిర్మల్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :ఆదివాసీల ధర్మయుద్ధ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ జాబితాలో కొనసాగుతున్న లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉట్నూర్‌లోని ఎంపీడీవో గ్రౌండ్స్‌లో ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంవత్సరాల నుంచి లంబాడా సోదరులు చట్ట విరుద్ధంగా రాజ్యాంగ విరుద్ధంగా ఆదివాసి తెగలకు అందాల్సిన రిజర్వేషన్లు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, అభివృద్ధి సంక్షేమ పథకాలన్నీ కూడా లంబాడా సోదరులే అనుభవిస్తూ నేడు ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేస్తూ వస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అదే విధంగా తాము చేస్తున్న ప్రజా, న్యాయ, రాజకీయ పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సహాయ సహకారాలు అందించాలన్నారు.

అమ్మవారి ఆదాయంపై పన్నుల పంజా

బాసర ఆలయ రాబడిపై జీఎస్టీ



అమ్మవారి నిలయం

టికెట్లను విక్రయిస్తున్న ఆలయ సిబ్బంది

- ఆర్జితసేవలు, ప్రసాదాలపై పన్ను భారం
- భక్తుల జేబులకు చిల్లు!
- దేవాదాయ శాఖ ఆలయాలకు ఆదాయ పన్ను శాఖ నోటీసులు
- ఖజానాకు కోట్లలో కోత

బాసర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):భక్తి భావంతో దేవుడికి చెల్లించే ఆర్జిత సేవా టికెట్లు, పవిత్ర ప్రసాదాలపై కూడా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కత్తి వేలాడుతోంది! రాష్ట్రంలోని దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయాల ప్రధాన ఆదాయ మార్గాలపై జీఎస్టీ వసూలు చేయాలని ఆదేశాలు రావడంతో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఒకటైన బాసర సరస్వతి అమ్మవారి దేవస్థానానికి రూ.కోట్ల భారం పడనుంది. ఆలయాల ప్రధాన ఆదాయ మార్గాలైన ఆర్జిత సేవల టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, వసతిగదుల అద్దె, వ్యాపార సముదాయాల లీజు ఆదాయంపై ప్రభుత్వం జీఎస్టీ వసూలు చేయాలని నిర్ణయించడం దేవాదాయ శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

● 2017 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటికీ,ఆలయాలకు తాజాగా నోటీసులు జారీ కావడంతో, ఇకపై భక్తులపై అదనపు భారం తప్పదని స్పష్టమవుతోంది.

● బాసర అమ్మవారికి రూ. కోట్లలో కోత

సరస్వతి అమ్మవారి ఆలయం విషయానికొస్తే,జీఎస్టీకారణంగా అమ్మవారి రూ.5కోట్ల వరకు అదనపుభారం పడేఅవకాశం ఉంది.హుండీ కానుకలు (రూ. 4.70 కోట్లు), విరాళాలు (రూ. 30లక్షలు) - వీటికి జీఎస్టీ మినహాయింపు ఉంది. సుమారు రూ.40 కోట్ల ఇతర ఆదాయం (అభిషేకాలు,అక్షర శ్రీకర పూజల టికెట్లు, ప్రసాదాలు, వసతి అద్దెలు)పై ఇప్పటివరకు ఆలయం జీఎస్టీ చెల్లించడం లేదు. ఈమొత్తంపై 5 నుంచి 18 శాతం వరకు కొత్తగా పన్ను చెల్లించాల్సి వస్తుంది.ప్రస్తుతం బాసర దేవస్థానంలో వ్యాపార సముదాయాల అద్దెపై మాత్రం గత మూడేళ్లుగా 18% జీఎస్టీ వసూలు చేస్తున్నారు.

ప్రధాన ఆదాయ మార్గాలు

- అక్షర శ్రీకర పూజల ద్వారా: రూ 5.80 కోట్లు
- ప్రసాదాల విక్రయం ద్వారా: రూ.8 కోట్లు
- వ్యాపార సముదాయాల అద్దె ద్వారా : రూ 3.60 కోట్లు
- హుండీ కానుకలు: రూ.4.70 కోట్లు
- ఏడాది మొత్తం ఆదాయం: రూ. 48 కోట్లు

●టికెట్ల ధరల పెంపు అనివార్యం?

ప్రస్తుతం పూజ టికెట్లపై జీఎస్టీ విధించడం లేదు. ఆర్జితసేవా టికెట్లు సైతం జీఎస్టీ పరిధిలోకి వస్తే, టికెట్ ధరలపై 5 నుంచి 18 శాతం వరకు అదనంగా జీఎస్టీ విధించే అవకాశం ఉంది. ప్రస్తుత ధరల్లోనే జీఎస్టీని సర్దుబాటు చేస్తారా, లేక భక్తులపై అదనంగా పన్ను విధిస్తారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ అదనపు భారం పడితే, టికెట్ల ధరలు పెరిగి, భక్తుల జేబులకు చిల్లు పడనుంది. ఇప్పటికే ఆలయాలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో,జీఎస్టీని విధించడం భక్తులను మరింత ఇబ్బంది పెట్టడమేనని విమర్శలు వినిపిస్తున్నాయి.

● అద్దె గదులపైనా పన్ను?

వసతి గదుల అద్దె రూ. 1,000 లోపు ఉంటే జీఎస్టీ వర్తించదని ఆలయ అధికారులు చెబుతున్నా, ప్రభుత్వ వర్గాలు మాత్రం ధరతో సంబంధం లేకుండా ప్రతిదీ జీఎస్టీ పరిధిలోకి వస్తుందని స్పష్టం చేస్తున్నాయి. మినహాయింపు జాబితాలో ఉన్న వాటికి మాత్రమే పన్ను ఉండదని, మిగతా వాటికి ఏదో ఒక స్లాబ్ కింద జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వ అధికారులు తేల్చి చెబుతున్నారు. దేవాలయాల ఆదాయంపై జీఎస్టీ విధించడంతో దేవుడి సేవలు, దర్శనాలకు వచ్చే భక్తులకు జీఎస్టీ రూపంలో అదనపు భారం తప్పేలా లేదు. ఈ నిర్ణయం ఆలయాల నిర్వహణ, భక్తులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

ఎలాంటి ఆదేశాలు రాలేదు



జీఎస్టీవిషయంలోఉన్నత అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం పూజా టిక్కెట్లు, ప్రసాదాలపై ఎలాంటి జీఎస్టీ లేదు. వెయ్యి రూపాయల లోపు వసతి గదులపై జీఎస్టీలేదు. జీఎస్టీ విషయంలో రాష్ట్ర అధికారుల ఆదేశాలు సూచనల ప్రకారం నిర్ణయం తీసుకుంటాం.

- అంజనా దేవి ఆలయ ఈఓ బాసర

నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు సన్మానం



నిర్మల్ కలెక్టర్‌కు సన్మానిస్తున్న గెజిటెడ్ అధికార సంఘ నాయకులు

నిర్మల్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్. పాటిల్ చేతుల మీదుగా 'జల సంచాయ్ - జన భాగీదారి' అవార్డు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను జిల్లా గెజిటెడ్ అధికారుల అధ్యక్షుడు డాక్టర్ పీజీ రెడ్డి, జిల్లా కార్యదర్శి ధాత్రిక రమేష్, కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు చెప్పారు. జాతీయ స్థాయిలో దక్షిణాది విభాగంలో నిర్మల్ జిల్లా రెండో స్థానంలో నిలిచి రూ.కోటీ రివార్డు పొందడం గర్వకార ణమని టీజీ వోస్ నాయకులు అన్నారు. ఈసందర్భంగా ఈవిజయంలో అధి కారుల కృషి, ప్రజల భాగస్వామ్యం ఉందని కలెక్టర్ తెలిపారు. టీజీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లాకార్యదర్శి, కార్య వర్గ సభ్యులు కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియ జేశారు.

ఆదిలాబాద్..

మావల నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ రాజర్శిషాకు అభినందనలు వెల్లు వెత్తుతున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా జల్ సంచార్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి నందుకు గానూ అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షాను కలెక్టర్ ఛాంబర్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డిలు సన్మా నించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మావల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ సు నీల్, జాదవ్, సంతోష్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తడిసిన వెంకట్‌రెడ్డి, మావల మాజీ మండల ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, మా జీ కోఆప్షన్‌మెంబర్ రహీమ్‌ఖాన్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షు డు గౌతం, ఎస్‌కేఅలీమ్, కుదురుపాక సురేష్, వసీం, దత్తు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆత్రం సుగుణ, బోరంచు

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్,నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపలగూడలో ఉదయం ఆటో,ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న రవీందర్ (55)గా యాలయ్యాయి. రవీందర్‌సైదుపూర్ ప్రాథమిక వైద్య శాలలో ఫార్మసిస్టుగా పని చేస్తున్నారని ఉదయం ఉద్యోగరీత్యా ఆదిలాబాద్ నుంచి సైదుపూర్ వెళ్లే సమయంలో యా పల్‌గూడ వద్ద ఈఘటన చోటు చేసుకుంది. తమకు సమాచారం రావడంతో గాయాలు తగిలి రోడ్డుపై ఉన్న రవీందర్‌ను అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించడం జరిగిందని 108 అంబులెన్స్ ఈఎంటీ రమేష్ తెలిపారు.

నేర నిర్మూలన అందరి బాధ్యత

- ఆదిలాబాద్ ఏఎస్పీ
- వడూర్‌లో 40బైక్‌లు, ఇతర వాహనాలు సీజ్



మాట్లాడుతున్న ఏఎస్పీ సురేందర్‌రావు

భీంపూర్,నవంబరు22(ఆంధ్రజ్యోతి): సమాజంలో నేరాల నిర్మూలన జరిగితే ప్రగతి సుసాధ్యం అవుతాయని ఆదిలాబాద్ ఏఎస్పీ సురేందర్‌రావు అన్నారు.భీంపూర్ మండలం వాడుర్‌లో పోలీస్ కమ్యూనిటీ కాంట్రాక్టులో భాగంగా శనివారం తెల్లవారు జామునుంచి సాయంత్రం వరకు వాహనతనిఖీ చేపట్టారు.సరైనపత్రాలు లేని నలభై మోటర్ సైకిల్‌లు, రెండు ఆటోలు, రెండు టాటాఏస్, ఒక మ్యాక్స్‌లను సీజ్‌చేశారు. అలాగే ఒకరి వద్ద ఎనిమిది మహారాష్ట్ర దేశీదారు సీసాలు స్వాధీనం చేసుకు న్నారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడొద్దని సూచించారు. రోడ్డునిబంధనలు పాటిం చకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐశ్రవణ్, ఎస్ఐ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య




నాగవ్వ(ఫైల్)

సోన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన ఎలిశెట్టి నాగవ్వ(55) ఒక సంవత్సరం కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ జీవితం మీద విరక్తి చెంది, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తన చీరతో ఉరేసు కొని ఆత్మహ త్య చేసు కుందని తెలిపారు. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దూప తీర్చేదెవరు..?

- పనిచేయని 'మిషన్ భగీరథ' వాల్వులు
- పట్టించుకోని పంచాయతీ, ఇంట్రా సిబ్బంది



పాడైన వాల్వు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి):ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో మిషన్ భగీరథ నీరు కొన్ని రోజులుగా రావడంలేదని గ్రామంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీని గురించి గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా నీరు రాలేక పోవడమనేది నిజమేనని మిషన్‌భగీరథ వాటర్ ట్యాంక్ దగ్గర వాల్ పనిచేయక పో వడం వల్ల ట్యాంకులోకి నీరు రాకపోవడంతో నీటి సరఫరాఆగిపోయిందని తెలిపారు.ఈపనిఇంట్రా సంస్థ వాళ్లు చేయాలని వాళ్లు చేయక పోవడంతోని మేము గ్రామం లోని ప్రజలకు నీరు అందించ లేక పోతున్నామని తెలిపారు. ఇదే విషయాన్ని ఇంట్రా అధికారులను వివరణ కోరగా వారు అది మాపని కాదని గ్రామపం చాయతీ కార్యదర్శి చేయించాలని గ్రామపం చాయితీ దగ్గర డబ్బులు లేకపోవడంతో మేము ప్రయత్నం చేస్తాం అని మాత్రమే చెప్పడం జరిగింది కానీ ఇది వారి పనే అని అధికారులు బదులిచ్చారు.

గ్రామస్థులంతా కలిసి తాత్కాలిక వంతెన ఏర్పాటు



తాత్కాలిక వంతెన నిర్మాణం చేపడుతున్న గ్రామస్థులు

పెంబి,నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామ సమీపంలోని దొత్తి వాగుపై వంతెన లేక రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పండించిన పంట మార్కెట్‌లో అమ్మడానికి దారి లేక పోవడంతో దొందారి, చాకిరేవు, వస్‌పల్లి, నాయికపు గూడ, ఎంగ్లాపూర్, ఆయా గ్రామ ప్రజలు ఏకమై ట్రాక్టర్ సహాయంతో బండరాళ్లు తెచ్చి వాగులో పేర్చి వంతెన నిర్మాణం చేపట్టారు. అధికారులు స్పందించి శాశ్వత నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆశాజనకంగా కంది పంట



పూతతో కంది పంట

తాంసి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెల్ల బంగారాన్ని నమ్ముకున్న రైతన్నకి ఈ ఏడూ కష్టాలతో పాటు నష్టాలు ఎదురయ్యాయి. ప్రస్తుతం కంది పంట పైనే అన్న దాతలు ఆశ పెట్టుకున్నారు. ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉంది. తాంసి మండలంలో చాలామంది రైతులు పత్తి పంటతో పాటు అంతర్ పంటగా కంది పంటను సాగు చేస్తుంటారు.అలాగే సోయపంటలో సైతం చాలా మంది రైతులు అంతర్ పంటగా కంది పంటను పండిస్తున్నారు. ప్రస్తుతం ఏ పంట పొలంలో చూసిన కంది పంట ఆశాజనకంగా కనిపించడంతో కనీసం ఈ పంటైన తమను ఆదుకుంటుందని గంపెడాశలతో ఉన్నారు. తాంసి మండలంలో సుమారు కొన్ని ఎకరాలలో కంది పంటను సాగుచే స్తున్నారు.ప్రస్తుతం మార్కెట్లో పంటకు ఆశించిన స్థాయిలో ధర కూడా కనిపిస్తుంది. కంది పంటతోనైనా రైతుల కష్టాలు తీరాలని ఆశిద్దాం.

నేడు ఆదివాసుల ధర్మయుద్ధం మహాసభ

- ఏకైక డిమాండ్‌తో ఆదివాసుల ఆందోళన



ఉట్నూర్‌లో గ్రౌండ్‌సిద్ధం చేస్తున్న దృశ్యం

ఉట్నూర్, నవంబర్22 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న ఏకైక డిమాండ్‌తో ఆదివాసీ గిరిజనులు ఆదివారం ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న భారీ సభకు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నట్లు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో వివరిస్తూ తరలిరావాలని కోరడంతో పెద్ద సంఖ్యలో గిరిజనులు గిరిజనులు తరలి వస్తున్నారని తుడందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావు, తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూరు దాదిరావులు తెలిపారు.'ఆదివాసీ బచావోలంబాడా హటావో' అనే ప్రధాన నినాదంతో ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలన్న డిమాండ్‌ను వ్యక్తం చేస్తున్నారు.శాంతిభద్రతల రక్షణలో భాగంగా పోలీసులు భారీభద్రత చర్యలు చేపడుతున్నారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,ఉట్నూర్ అదనపు ఎస్పీకాజల్‌సింగ్‌ల తెలిపారు.ప్రతి ఆదివారం ఉట్నూర్‌లో జరిగే వారసంతతో పాటు ఉట్నూర్ పట్టణంలోని వ్యాపార సంస్థలు సైతం ఆదివాసుల ధర్మయుద్ధం మహాసభ ఉండడంతో బంద్ పాటించాలని భావించాయి.

లేబర్‌కోడ్ జీవోలను రద్దు చేయాలి



జీవో ప్రతులను తగలబెడుతున్న దృశ్యం

నిర్మల్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడే లేబర్ కోడ్ జీవోలను రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కే. రాజన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో టీయూసీఐ ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను సవరణ చేస్తూ కార్మిక హక్కులను కాలరాసే విధంగా కార్మికుల శ్రమను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టే విధంగా ఉన్నాయన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన విడుదల చేసిన జీవోను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బక్కన్న, సహాయ కార్యదర్శి గంగన్న, కోశాధికారి ఎంపీ గఫూర్, నాయకులు కిరణ్, గంగాదర్, శ్రీనివాస్, శంకర్,రమణ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బోథ్, సోనాల మండలాల్లో మంత్రి పర్యటన

బోథ్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు బోథ్, సోనాల మండలాల్లో పర్యటించనున్నారు. బోథ్ మండలంలోని పరిచయ గార్డెన్‌లో ఉదయం 11.40 నిమిషాలకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు చీరల పంపిణీ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాల వారు తెలిపారు. అంతేకాక నూతనంగా మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను అందించినట్లు తెలిసింది. ఇక సోనాల మండల కేంద్రంలో 93లక్షల పై చిలుకు నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు.

ఎగిసి పడుతున్న భగీరథ నీరు

- భగీరథ ప్రధాన మ్యాన్ హోల్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



మ్యాన్‌హోల్‌ను ఢీకొనడంతో ఎగిసిపడుతున్న మిషన్ భగీరథ నీరు

నిర్మల్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ప్రధానమ్యాన్ హోల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నీరు భారీగా ఎగిసి పడింది. ఈ ఘటన జిల్లాకేంద్రంలోని గాజులపేట ప్రధాన రహ దారిపై శుక్రవారం చోటుచేసు కుంది. వాహనం ఢీకొన్న దాటికి మ్యాన్ హోల్ పగిలిపోవడంతో లోపల ఉన్న ప్రధాన పైప్ లైన్ నుంచి భారీ ఎత్తున నీరుధారలు ఒక్కసారిగారోడ్డుపైకి ఉప్పొంగి ఎగిసి పడ్డాయి.జలధారల తీవ్రత, పరిమాణంచూసి ఆప్రాంతంలో ఉన్న స్థానికులు,అటుగా ప్రయాణిస్తున్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన కారణంగా ఆ ప్రధాన రహదారిపై సు దీర్ఘ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

యుద్ధ ప్రాతిపదికన అధికారుల చర్యలు

ఈ సమాచారం అందిన వెంటనే నిర్మల్ మున్సిపల్ అధికారులు, మిషన్ భగీరథ విభాగం యంత్రాంగం తక్షణమే సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు నీటి సరఫరాను నిలిపి వేసి, నష్టాన్ని అరికట్టడానికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రధాన మ్యాన్ హోల్స్ వద్ద మరింత భద్రతను పెంచుతామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

గీత కార్మికుడికి పరామర్శ



భూమా గౌడ్‌ను పరామర్శిస్తున్న అమరవేణి నర్సాగౌడ్

నిర్మల్‌చైన్‌గేట్,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని దేవేందర్‌రెడ్డి హాస్పిటల్‌లో గత రెండు రోజుల క్రితం ఖానాపూర్ మండల కేంద్రానికి చెందిన కొత్త కొండ భూమాగౌడ్ అనే గీత కార్మికుడు బాధనకుర్తి గ్రామ శివారులో తాటి చెట్టు పైనుంచి పడి రెండు కాళ్ల విరిగి తీవ్ర గాయాలపాలై దేవేందర్‌రెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భూమా గౌడ్‌ను మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ కలిసి పరామర్శించారు. తన ఆరోగ్యం గురించి డాక్టర్‌తో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రమాద బీమాను సంఘం ద్వారా ఇప్పిస్తామని తెలియజేశారు. ఈసందర్భంగా అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ..నిరుపేద గౌడ కులానికి చెందిన గీత కార్మికుడు కొత్త కొండ భూమాగౌడ్ కల్లు గీత వృత్తిపై ఆధారపడి గత 25సంవత్సరాల నుంచి జీవనోపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థికంగా నిలబడ్డ భూమాగౌడ్ తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాల పాలవ్వడం వల్ల కుటుంబ పోషణ లేక ఆర్థిక ఇబ్బందుల పాల వ్వడం జరిగిందన్నారు. టీఎఫ్‌టీ లైసెన్స్ కలిగి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనేవిచారణ జరిపి రూ.5 లక్షల ప్రమాదబీమా ఇచ్చి భూమాగౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా అబ్కారీ అధికారుల ను కోరారు.ఈకార్యక్రమంలో బొంగోని గంగా ధర్ గౌడ్, బావు మహేష్ గౌడ్, పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ



కుటుంబాన్ని పరామర్శిస్తున్న మోహన్‌రావు పటేల్

ముథోల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో పెండ్యాల భూదేవి అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. అయితే ఈ విషయం తెలుసుకున్న మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ శనివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట సాయినాథ్ గౌడ్, లచ్చారాం, మోడపు రమేష్, తదితరులున్నారు.

నాయుడు వాడలో ఘనంగా అమ్మవారి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం


నిర్మల్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాయుడువాడలో గల శ్రీవాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి పల్లకీ సేవ, అమ్మవారి పారాయణం శుక్రవారం రాత్రి పురవీధుల్లో నిర్వహించినట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నేడు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి వాసవి మాత అమ్మవారి ఆలయానికి వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం యువజన మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నాడు



గుర్రపు డెక్కతో కనిపిస్తున్న చెరువు

నేడు




నీటితో కళకళలాడుతున్న చెరువు

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువులో గుర్రపుడెక్క నిండిపోయింది. వర్షా కాలంలో కురిసిన భారీ వానలకు వరద నీటితో కలకలాడుతూ కనిపించిన చెరువులో ప్రస్తుతం పూర్తిగా గుర్రపు డెక్క మాత్రమే కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా గుర్రపు డెక్క సమస్య వేధిస్తున్నప్పటికీ పట్టించుకున్న వారు లేరని, నామమాత్రంగా పనులు చేపడుతున్నా అవి ఫలితాలు ఇవ్వడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినీ ట్యాంక్ బండ్‌గా మార్చే ప్రతిపాదనలకు కార్యరూపం దాలిస్తే అందమైన చెరువు పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని పంచుతుందని చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3, కనిష్ఠం 14.2
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 23 నవంబరు 2025



- పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికారులు
- నేడు సర్పంచ్, వార్డు మెంబర్ రిజర్వేషన్ల ఖరారు
- బీసీ రిజర్వేషన్‌ల్లో మార్పులు, యథావిధిగా ఎస్సీ, ఎస్టీ స్థానాలు
- ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ జారీకి అవకాశం
- ఆశావహ నేతల్లో మళ్లీ మొదలైన ఉత్కంఠ
- ఇక రసవత్తరంగా మారనున్న పల్లె రాజకీయం

రిజర్వేషన్లపై ఉత్కంఠ





ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పంచాయతీ ఎన్నికలకు అధికారులు సిద్దమవుతున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికల రిజర్వేషన్ల ఖరారుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. శనివారం రిజర్వేషన్లకు సంబంధించిన విధి విధానాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 46ను విడుదల చేసింది. దీనాధారంగానే అధికారులు రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం లోగా రిజర్వేషన్లు ఫైనల్ చేసి జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం అందజేస్తారు. ఆ వెంటనే రిజర్వేషన్లను అధికారికంగా ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతు వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఈ నెల 24న హై కోర్టుకు పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నివేదికను అందించనున్నారు. ఆ లోగానే నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఇది వరకు ఖరారైనా రిజర్వేషన్లే ఉంటాయా లేదా ఏమైనా మార్పులు చేర్పులు జరుగుతాయా అనే ఆసక్తి సర్వత్ర కనిపిస్తుంది. జిల్లాలో 473 సర్పంచ్ స్థానాలు, 3870 వార్డు స్థానాలు ఉన్నాయి. సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను ఆర్డీవో, వార్డు రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేస్తారు. మొత్తానికి రిజర్వేషన్ల ఖరారు తర్వాత పల్లె రాజకీయాలు మరింత రసవత్తరంగా మారనుంది.

మెజార్టీ స్థానాలు ఎస్టీలకే..

జిల్లాలో మొత్తం 473 గ్రామ పంచాయతీలకు గాను 251 ఏజెన్సీ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలాగే 100 శాతం గిరిజన జనాభా కలిగిన గ్రామ పంచాయతీలు మరో 14 ఉన్నాయి.మొత్తం 265 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ స్థానాలు ఎస్టీ రిజర్వుడు కానున్నాయి. దీంతో మెజార్టీ స్థానాలు ఎస్టీలకే దక్కే అవకాశం ఉంది. అలాగే మిగితా 208 జనరల్ పంచాయతీల్లో ఎస్సీ 31, ఎస్టీ 47, బీసీ 23, జనరల్‌కు 107 స్థానాలను కేటాయించనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ సర్పంచ్ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు.

రేపు నోటిఫికేషన్?

దాదాపుగా రిజర్వేషన్ ప్రక్రియ ఖరారైనట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఆదివారం సాయంత్రం వరకు పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం కనిపిస్తుంది. ఒకవేళ

(తరువాయి 6వ పేజీలో)

మొత్తం గ్రామ పంచాయతీలు	473
మొత్తం వార్డుల సంఖ్య	3870
మొత్తం ఓటర్లు	4 లక్షల 47వేల 135
మహిళా ఓటర్లు	2 లక్షల 28వేల 436
పురుష ఓటర్లు	2 లక్షల 18వేల 683
ఇతరులు	16 మంది

జిల్లాలో సర్పంచ్ రిజర్వేషన్ల స్థానాలు ఇలా... (అంచనా)

మొత్తం గ్రామ పంచాయతీలు	473
ఏజెన్సీ గ్రామ పంచాయతీలు	251
వందశాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలు	14
ఎస్సీ రిజర్వుడు పంచాయతీలు	31
ఎస్టీ రిజర్వుడు పంచాయతీలు	47
బీసీ రిజర్వుడు పంచాయతీలు	23
జనరల్ రిజర్వుడు పంచాయతీలు	107



విద్యార్థులతో కలెక్టర్ రాజర్షి షా

నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సేవలందించడంలో విజ్ఞాన్ ప్రత్యేక పాఠశాల ప్రతినిధులు చూపుతున్న సేవ భావన ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో విజ్ఞాన్ ప్రత్యేక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, సైకాలజిస్టు శ్రీహరి, విద్యా కౌన్సిలర్ మహిపాల్, ఉపాధ్యాయురాలు స్వప్న, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా నరేష్ జాదవ్

- పార్టీ విధేయుడికే పట్టం
- పదవిని ఆశించిన పలువురు నేతలకు షాక్



ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి జిల్లా రథ సారధి ఎట్టకేలకు ఖరారయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ నరేష్ జాదవ్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఖరారు కావడంతో ఇన్నాళ్ల సస్పెన్స్‌కు తెర పడినట్లయింది. జిల్లాలో గత రేండేళ్లుగా కీలకమైన ఈ పదవి ఖాళీగా ఉంది. ఈ పదవిని దక్కించుకునేందుకు అనేకమంది ఆశా వహులు పోటీ పడ్డారు. అధ్యక్షుల నియామకం కోసం ఆ పార్టీ అధిష్ఠానం జిల్లాల వారీగా ప్రత్యేకంగా పరిశీలకులను పంపించింది. వారు జిల్లాలో సుమారు వారం రోజుల పాటు ఇక్కడే ఉండి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం పార్టీ అధికారంలో ఉండడంతో జిల్లావ్యాప్తంగా పలువురు నాయకులు కీలకమైన అధ్యక్ష పదవి కోసం పోటీపడ్డారు. దరఖాస్తులు అందించడంతో పాటు పదవిని చేజిక్కించుకునేందుకు ఎవరికీ వారు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. కొందరు నాయకులు తరుచూ అధిష్ఠానం పెద్దలను కలుస్తూ పదవి వరించేలా ప్రయత్నం చేశారు. కానీ ఆ పార్టీ అధిష్ఠానం మాత్రం చివరకు సీనియర్ నేత నరేష్ జాదవ్‌కు అవకాశం కల్పించింది. దీంతో పదవి కోసం తీవ్రంగా ప్రయత్నా లు చేసిన పలువురు నాయకులు పదవి దక్కక పోవడం పట్ల తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

లక్షెట్టిపేట ఆశ్రమ పాఠశాలలో డీడీ తనిఖీలు

- విద్యార్థుల సరుకులు, రిజిస్టర్ల పరిశీలన

ఉట్నూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. శనివారం మండలంలోని లక్షెట్టిపేటలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఉదయం అసెంబ్లి సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు, సమయపాలనను పరిశీలించారు. తరగతి గదులు, వసతి గృహాలు, వంటగది పాఠశాల ఆవరణను పరిశీలించారు. హెడ్ మాస్టర్ సిబ్బందికి విద్యార్థుల 100 శాతం హాజరు సాధించాలని, నిర్దేశించి ఆహార పట్టికను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల కోసం 100 రోజుల కార్యచరణ ప్రణాళికను సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. పదో తరగతిలో 100శాతం పలితాలు సాధించేలా విద్య బోధన చేయాలన్నారు. పాఠశాలల్లో ఆరోగ్యం మరియు పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని స్టోర్‌రూమ్ సందర్శించి గిరిజన సహకార సంస్థ ద్వారా అందిస్తున్న ఆహార సరుకుల నాణ్యత పరిశీలించారు. వం టగదులను సందర్శించి ప్రతిరోజు తాజా కూరగాయాలతో పాటు పౌష్టిక ఆహారం విద్యార్థులకు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రతీ ఉపాధ్యాయుడు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌చౌహాన్, డిప్యూటీ వార్డెన్ జాదవ్ మధుసూదన్‌లున్నారు.



లక్షెట్టిపేట ఆశ్రమ పాఠశాల రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న డీడీ



భూసార పరీక్షల కిట్లను అందిస్తున్న వ్యవసాయ అధికారి

భూసార పరీక్షలు తప్పనిసరి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి అన్నారు. రైతులు భూసారానికి అనుగుణంగా ఎరువులను వాడితే అధిక దిగుబడులను పొందవచ్చని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షల కిట్ లను ఏఈవోలకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలపై వారికి శిక్షణ ఇచ్చారు. ఏడిఏ శ్రీకర్, ఏఓ లు సంధ్యారాణి, రజిత పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అతిగా యాంటీ బయోటిక్ మందులను వినియోగిస్తే అనారోగ్యంతో బాధపడాల్సి వస్తుందని, రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతుందని రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ అన్నారు. యాంటీ బయోటిక్‌లను అతిగా వినియోగించవద్దని అవగాహన కల్పిస్తూ రిమ్స్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికోలు, ఆశ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని.. ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ అతిగా యాంటీ బయాటిక్ మందులను వినియోగిస్తే అనర్థాలు తప్పవన్నారు. వైద్యుల సూచనల మేరకు పరిమితిలోనే మందులు వాడాలని తెలిపారు. ఈ అంశాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు.



బోథ్ ఎంపీడీవో కార్యాలయంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

రాజకీయ పార్టీల సమక్షంలో రిజర్వేషన్ల లక్కీడ్రా

బోథ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీల వార్డు రిజర్వేషన్లను ఎంపీడీవో రమేష్ సమక్షంలో డ్రా తీయడం జరిగింది. అని రాజకీయ పక్షాల నాయకులను ఆహ్వానించి వారి సమక్షంలో డ్రా తీశారు. లక్కీ డ్రా ప్రకారంగా రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎంపీడీవో వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐలకు చెందిన వారు పాల్గొన్నారు.

వామ్మో చిరుత



- ముద్గల్ గ్రామ శివారులో చిరుత సంచారం
- భయాందోళనలో రైతులు

వివరాలు 8వ పేజీలో...

అమ్మవారి ఆదాయంపై పన్నుల పంజా

7లో

- ఆర్జిత సేవలు, ప్రసాదాలపై పన్ను భారం
- భక్తుల జేబులకు చిల్లు!
- దేవాదాయ శాఖ ఆలయాలకు ఆదాయ పన్ను శాఖ నోటీసులు
- ఖజానాకు కోట్లలో కోత



ఆధ్యాత్మిక బాటలోనే ప్రశాంతత



మాజీ మునిసిపల్ చైర్మన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక బాటలో పయనిస్తూ ప్రశాంత జీవనాన్ని గడపాలని మాజీ మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ శివ పంచాయతన సహిత అభయాంజనేయ స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో వివిధ పూజాది క్రతువుల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఈమేరకు మాజీ మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యతను ఇచ్చినట్లు తెలిపారు. ఆలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మిక భావన వెల్లివిరుస్తుందని పేర్కొన్నారు. భగవంతుడి కృపతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, చిన్న గంగారాం, రాజశేఖర్, అశోక్, రమేష్, మల్లయ్య, సాగర్, రవి, రాకేష్, హరీశ్, కాలనీవాసులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అదనపు ఎస్పీ(అడ్మిన్)గా బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఐపీఎస్‌ల బదిలీలలో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ ఏసీపీగా విధులు నిర్వహించి ఆదిలాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ అయిన పి.మౌనిక శనివారం పోలీసు ముఖ్య కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. పరిపాలన విధులు మరింత చురుగ్గా, సులువుగా జరిగేలా చర్యలు చేపడతామని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ అడ్మిన్ మౌనిక

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పిన దృశ్యం

ఉట్నూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దంతన్‌పల్లి బీర్సాయిపేట్ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మహిళలు యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో శనివారం చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజక వర్గ ఇన్‌చార్జీ భూక్యా జాన్సన్ నాయక్ గులాబీ కండువా కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాన్సన్‌నాయక్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో చేసిన అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల గుండెట్లో బీఆర్‌ఎస్ పార్టీ సుస్థిర స్థానం సంపాదించుకుందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన కేవలం బీఆర్‌ఎస్ పార్టీని విమర్శించడం తప్ప అభివృద్ధి చేసింది మాత్రం శూన్యమని ఇకనైనా చౌకబారు రాజకీయాలు మానుకొని ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. పార్టీలో చేరిన మహిళలకు, యువకులకు నాయకులకు కార్యకర్తల కు హృదయపూర్వక స్వాగతమని భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంద్రజైవంత్‌రావ్, ముజీబ్‌ఖాన్, సలీమొద్దిన్, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉదయం పూట కమ్ముకున్న దట్టమైన పొగమంచు

చలి తగ్గిందోచ్..!

- అత్యల్పంగా అర్లి(టి)లో 12.1 ఉష్ణోగ్రతలు నమోదు

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో చలితీవ్రత కొంత తగ్గుముఖం పడుతుంది. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతు వస్తున్నాయి. శనివారం జిల్లా నగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 30.3 డిగ్రీలు కాగా కనిష్టంగా 11.2 డిగ్రీలుగా నమోదయ్యాయి. అలాగే అత్యల్పంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 12.1, బజార్‌హత్నూర్‌లో 12.4, సాత్నాలలో 12.9, తాంసిలో 13.0, ఇచ్చోడలో 13.4, సోనాలలో 13.7, తలమడుగులో 14.0 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 20 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఇన్నాళ్లు తీవ్రమైన చలితో వణికి పోయిన జనానికి పెరిగి పోతున్న ఉష్ణోగ్రతలతో చలి ప్రభావం తగ్గుతుంది. పగలంతా పెద్దగా చలిప్రభావం లేక పోయిన రాత్రిళ్లు, ఉదయం మాత్రం శీతలగాలులకు చలి తీవ్రత కనిపిస్తుంది. చలితీవ్రత కొంత తగ్గుముఖం పట్టిన పరిసర ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పేస్తుంది. ఉదయం పూట చలిమంటలు వేసుకుంటు ప్రజలు వెచ్చదనం పొందుతున్నారు.

ప్రతి డ్వాక్రా మహిళలకు చీరలు అందే విధంగా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం

బోథ్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న చీరలను డ్వాక్రా మహిళలందరికి మొదటి విడతలు అందే విధంగా చూడాలని డీపీఎం వెంకటసాయిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో సీసీలు సీఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల మొత్తం మీద పదివేల 773 మంది మహిళలకు చీరలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాక మిగత మహిళలకు సైతం చీరలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగింది అన్నారు. త్వరలోనే 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు చీరలను అందించడం జరుగుతుందని ఈ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సీసీలకు సూచించారు. చీర ఇవ్వగానే తీసుకున్న మహిళతో కలిసి ఫోటో దిగాల్సి ఉంటుందని వివరించారు.

ఉట్నూర్ పంచయతీ మహిళకే..

ఉట్నూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి లక్కీ లాటరీలో మహిళకు రిజర్వు చేయడం జరిగింది. సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ పంచాయతీలకు నిర్వహించిన రిజర్వేషన్ల ఎంపిక కోసం లక్కీ లాటరీ నిర్వహించారు. మండలంలోని ప్రధాన గ్రామ పంచాయతీ లక్కారం సైతం మహిళలకు రిజర్వు అయినట్లు అధికారుల ద్వారా తెలిసింది. మండలంలో కొత్తగా ఏర్పడిన వనగల్పూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం జనరల్‌గా ప్రకటించారు.